# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 23-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:253 పేజీలు:6 వెల: రూ.1/-


## కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపిన జూనియర్ డాక్టర్లు..

హైదరాబాద్, జూన్ 22 :పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు వినూత్నంగా నిరసన తెలిపారు. కండ్లకు గంతలు కట్టుకొని నినదించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు దీపాంకర్ మాట్లాడుతూ ప్రతి నెలా నిర్దిష్టమైన తేదీకి స్టయిఫండ్ ఇవ్వాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉస్మానియా ఆసుపత్రి భవనం మూసివేసి నాలుగేల్లు అయ్యిందని.. పక్కనే ఉన్న మరో భవనంలోకి ఆసుపత్రి మార్చారన్నారు. రద్దీ కారణంగా ఇన్‌ఫెక్షన్ల శాతం పెరుగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్లపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు కండ్లకు గంతలు కట్టుకొని మధ్యాహ్న భోజన విరామ సమయంలో బోధనా ఆసుపత్రుల్లో నిరసన తెలిపారు. నల్లబాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు.

### చురక

పార్టీ పిరాయింపు నిత్య
ప్రజాస్వామ్య తలవంపు
పవర్ రాజకీయ కుటిల
ప్రలోభాల స్వార్థ కంపు

నిన్న వాళ్ల బాటలోనే
నేడు వీళ్ల క్రీడాటలు
పరస్పరం ఎందుకింకా
పరువుబోయె కొట్లాటలు

–వేల్పుల నారాయణ
9440433475



## బసవతారకం ఆస్పత్రి సేవలకు రేవంత్ ప్రశంసలు..



హైదరాబాద్, జూన్ 22 :హైదరాబాద్ లోని బసవతారకం ఆస్పత్రి లక్షల మందికి సేవలు అందిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి 24 వ వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బసవతారకం కాన్సర్ హాస్పిటల్ మేనేజింగ్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్ రావు అలాగే డా. నోరి దత్తాత్రేయుడు హాజరయ్యారు.


ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, నిస్వార్థంగా పేదలకు సేవలు అందించేందుకు ఈ ఆస్పత్రిని నిర్మించారని, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిని దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఏపీ సీఎం చంద్రబాబుతో అభివృద్ధిలో పోటీ పడే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ అన్నారు. ఆయన 18 గంటలు పనిచేసి.. నేను 12 గంటలు పనిచేస్తే సరిపోదన్నారు. తెలంగాణలోని రాష్ట్ర మంత్రులు, అధికారులు సైతం 18 గంటలు పనిచేయాల్సిందేనని వెల్లడించారు. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడాలని, ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలన్నారు. అదే విధంగా హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు.

హిందూపూర్ ఎంఎల్ఏ, బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి అందరికి ఆదర్శమని, .ఆయన ఈ వేడుకకు రావడం ఎంతో ఆనందంగా వుందిని అన్నారు. .స్వర్గీయం నందమూరి తారక రామారావు గారు ఎంతో దూర దృష్టి కలిగిన వ్యక్తి.. మంచి ఆలోచన తో ఈ హాస్పిటల్ నిర్మించారు.ఆనాడు బండలతో నిండి వున్న ఈ స్థలంలో బసవతారకం ఆస్పత్రి కట్టారు. ఇప్పటికి మంచి సేవలు అందుతున్నాయి.. భారత మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారి వాజ్ పేయి గారు అప్పట్లోనే ఈ హాస్పిటల్ కోసం 6 కోట్లు మంజూరు చేసి హాస్పిటల్ బలోపేతానికి దోహదపడ్డారు.. ఇటువంటి గొప్ప హాస్పిటల్ కి ఛైర్మన్ గా పని చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.ఆంధ్ర రాష్ట్రం ఎమ్మెల్యే గా హిందూపురం ప్రభుత్వ హాస్పిటల్ ని తీర్చి దిద్ది కార్పోరేట్ తరహా వైద్యం అందిస్తున్నాం..అలాగే ఆంధ్ర ప్రదేశ్ లో కూడా త్వరలో బసవతారకం కాన్సర్ హాస్పిటల్ ప్రారంభించనున్నాం..ఇప్పటికే ఆంధ్ర రాష్ట్రంలో గతంలోనే చంద్రబాబు గారు స్థలం కేటాయించారు..అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు బాలయ్య తెలిపారు.

## అయోధ్యలో బాలరాముడికి ప్రాణ ప్రతిష్ట చేసిన ప్రధాన పూజారి మృతి

వారణాసి జూన్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అయోధ్య రామాలయంలో బాలరాముడికి ప్రాణ ప్రతిష్ట చేసిన ప్రధాన పూజారి ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ ఇవాళ తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 86 ఏళ్లు. గత కొన్ని రోజులుగా ఆయన ఆరోగ్యంగా సరిగా లేదని కుటుంబసభ్యులు వెల్లడించారు. వారణాసిలోని గంగా నది తీరంలో ఉన్న మణికర్ణిక ఘాట్‌లో ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జనవరి 22వ తేదీన అయోధ్యలో రామ్‌లల్లాను ప్రతిష్టించిన విషయం తెలిసిందే. ఆ రోజున నిర్వహించిన పూజలకు ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ నాయకత్వం వహించారు.వారణాసిలో ఉన్న పండితుల్లో లక్ష్మీకాంత్ దీక్షిత్‌ను అగ్రగణ్యులగా భావిస్తారు. వీరి స్వస్థలం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా. కానీ వారి కుటుంబసభ్యులు ఎన్నో తరాలుగా వారణాసిలోనే నివసిస్తున్నారు. ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ మృతి పట్ల యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. తన ఎక్స్ పోస్టులో ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ కాశీకి చెందిన గొప్ప పండితుడు అని, శ్రీరామ జన్మభూమి ప్రాణ ప్రతిష్టలో ఆయన పాల్గొన్నారని, ఆయన మనల్ని వదిలివెళ్లడం.. ఆధ్యాత్మిక, సాహితీ ప్రపంచానికి తీరని లోటు అవుతుందని సీఎం యోగి పేర్కొన్నారు.సంస్కృత భాషకు, భారతీయ సంస్కృతికి ఆయన చేసిన సేవల్ని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని సీఎం యోగి తన ఎక్స్ పోస్టులో వెల్లడించారు. రాముడి పాదాల వద్ద ఆయనకు చోటు ఇవ్వాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయన భక్తులకు, ఫాలోవర్లకు శక్తిని ఇవ్వాలన్ని సీఎం వేడుకున్నారు.

## బంగ్లా దేశీయులకు ఇక మెడికల్ ఈ వీసాలు- మోదీ



న్యూఢిల్లీ, జూన్ 22 : రెండు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తో నేడు ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విదేశీ నేతలతో మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో ఇరుదేశాల ప్రధానులు లక నిర్ణయం తీసుకున్నారు. బంగ్లాదేశ్ నుంచి చికిత్స కోసం భారత్‌కు రావాలనుకునే వారికి ఇకపై ఈ–వీసా సదుపాయాన్ని కల్పించనున్నారు. దీనికోసం రంగ్‌పుర్‌లో కొత్తగా అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నట్లు మోదీ తెలిపారు. బంగ్లాదేశ్‌లోని వాయవ్య ప్రాంత ప్రజలు సులువుగా భారత్‌కు వచ్చి చికిత్స పొందే వీలుంటుందని చెప్పారు. బంగ్లాదేశ్‌తో సంబంధాలకే భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు.

దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందుకు వెళ్తున్నట్లు మోదీ వెల్లడించారు. ఇరుదేశాల రక్షణ సహకారం, సాయుధ బలగాల ఆధునీకరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. బంగ్లాదేశ్– భారత్ సరిహద్దులో ఉగ్ర కార్యకలపాలను అడ్డుకోవడంతోపాటు శాంతిస్థాపనకు కృషి చేయాలని ఇరుదేశాలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రెండు దేశాల మధ్య 4096.7 కిలోమీటర్ల సరిహద్దు ఉందన్నారు. భారత్‌కు పొరుగుదేశాలతో ఉన్న సరిహద్దులో ఇదే పెద్దదిగా పేర్కొన్నారు. 'ఇండియన్ ఓషన్ రీజియన్' అంశంలోనూ భారత్‌కు తోడుగా నిలిచేందుకు బంగ్లాదేశ్ ముందుకు రావడాన్ని మోదీ స్వాగతించారు. 'బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోపరేషన్ తోపాటు ఇతర అంతర్జాతీయ ఫోరమ్‌ల విషయంలోనూ ఇదే సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.

ఇరుదేశాల మధ్య వాణిజ్య, సహకార సంబంధాల బలోపేతానికి కృషి చేస్తామని మోదీ తెలిపారు. "గత 10 ఏళ్లలో మేం ఇరుదేశాల మధ్య 1965 నాటికి ముందున్న సంబంధాలను పునరుద్ధరించాం. ఇకపై డిజిటల్, ఎనర్జీ కనెక్టివిటీపై దృష్టి పెడతాం. తద్వారా ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు పటిష్ఠమవుతాయి" అని మోదీ అన్నారు. మొత్తం 54 నదులు భారత్, బంగ్లాదేశ్ మీదుగా ప్రవహిస్తున్నట్లు గుర్తు చేసిన ప్రధాని.. వరదల నిర్వహణ, ముందస్తు హెచ్చరికలు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో పరస్పరం సహకరించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 1996 నాటి గంగా జలాల ఒప్పందాన్నే అనుసరిస్తున్నామని, దీనిలో కొన్ని మార్పులు చేయాలని తాజా సమావేశంలో నిర్ణయించామన్నారు. దీని కోసం భారత్ నుంచి ఓ సాంకేతిక బృందం త్వరలోనే బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతుందని చెప్పారు.

## ఆదివాసి మహిళకు అండగా ఉంటాం - మంత్రి జూపల్లి



నాగర్ కర్నూల్ ,జూన్ 22 :ఆదివాసి మహిళ ఈశ్వరమ్మ పై అమానుషంగా దాడి చేసి చిత్రహింసలకు గురి చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గిరిజన మహిళ ఈశ్వరమ్మను మంత్రి జూపల్లి కృష్ణారావు నేడు పరామర్శించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ . ఆ కుటుంబం ఇంకొకరితో పని చేయకుండా గౌరవంగా బ్రతికేందుకు భూమి ఇచ్చి ఆదుకుంటామని తెలిపారు. ఈశ్వరమ్మకు మెరుగైన చికిత్స తో పాటు వారి పిల్లల విద్య అందిస్తామని వెల్లడించారు.ఆమెపై జరిగిన దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా కఠినాది కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

## రాగల నాలుగు రోజుల పాటు తెలంగాణలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు

### -ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ

హైదరాబాద్ జూన్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణలో రాగల నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా. గత 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా కరీంనగర్ జిల్లా రామడుగులో 13 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైంది. అలాగే, ములుగు జిల్లా ఏటూరునాగారంలో 12 సెంటీమీటర్లకుపైగా వర్షం కురిసింది.

## జిల్లాల్లో భారీ వర్షాలు..! ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..!

హైదరాబాద్, జూన్ 22 : తెలంగాణలో రాగల నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా. గత 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా కరీంనగర్ జిల్లా రామడుగులో 13 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైంది. అలాగే, ములుగు జిల్లా ఏటూరునాగారంలో 12 సెంటీమీటర్లకుపైగా వర్షం కురిసింది.

## నీట్ యూజీ 2024 అవకతవకలపై సీబీఐ.. ఈడీ దర్యాప్తు.. సుప్రీంకోర్టులో పిటిషన్..!


న్యూఢిల్లీ, జూన్ 22 :ఎంబీబీఎస్ సహా పలు వైద్య విద్యా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం గత నెల ఐదో తేదీన నిర్వహించిన 'నీట్ యూజీ -2024' పరీక్షలో అవకతవకలపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో తాజాగా పిటిషన్ దాఖలైంది. నీట్ పరీక్ష రాసిన 10 మంది అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, అవకతవకలపై బీహార్ పోలీసులు త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించాలని కోరారు. 'నీట్ యూజీ -2024 పరీక్ష రద్దుతో తలెత్తే పరిణామాల గురించి మాకు పూర్తిగా తెలుసు. కానీ అంతకు మించిన ఆల్టర్నేటివ్ లేదు' అని పిటిషనర్లు పేర్కొన్నారు.

'నీట్ యూజీ -2024 పరీక్ష నిర్వహణ పలు అవకతవకలతో కూడుకున్నది. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సకాలంలో ప్రశ్నాపత్రాలు అందించలేదు. మరికొన్ని చోట్ల తప్పుడు సెట్ ప్రశ్నపత్రాలు ఇచ్చి తర్వాత వెనక్కి తీసుకున్నారు' అని పిటిషనర్లు తెలిపారు. నీట్ యూజీ 2024 రద్దుతోపాటు కోర్టు పర్యవేక్షణ తో దర్యాప్తు చేయాలని దాఖలైన పిటిషన్ల మీద అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిపేయబోమని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది.నీట్ యూజీ 2024 పరీక్షలో అవకతవకలను నిరసిస్తూ పలు నగరాల్లో విద్యార్థులు, విపక్ష పార్టీలు ఆందోళనలు చేస్తున్నాయి. గత నెల ఐదో తేదీన దేశవ్యాప్తంగా 4750 కేంద్రాల్లో సుమారు 24 లక్షల మంది విద్యార్థులు నీట్ యూజీ 2024 పరీక్షకు హాజరయ్యారు. వాస్తవంగా ఈ నెల 14న వెల్లడించాల్సిన నీట్ పరీక్షా ఫలితాలు ఈ నెల నాలుగో తేదీనే ప్రకటించారు.అయితే ఎన్టీఏ చరిత్రలోనే 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు వందశాతం మార్కులు వచ్చాయి. హర్యానాలోని ఫరీ దాబాద్‌లో ఆరుగురు విద్యార్థులకు వందశాతం మార్కులు వచ్చాయి. 67 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడం వల్లే వందశాతం మార్కులు వచ్చాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర యూజీ వైద్య విద్యాకోర్సుల్లో అడ్మిషన్ల కోసం ప్రతి ఏటా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 'నీట్ యూజీ' పరీక్ష నిర్వహిస్తోంది.

### నేటి కందం– నేటికీ అందం

ప్రజలకు నుపయుక్తమగుట
నిజమగు సంసేవనముగ నిర్ధారింపన్
సుజనులు–సేవను భవుడిడు
నజరానాగా దలతురు నవ్యపథములోన్

(జూన్ 23 ప్రజా సేవాదినం..)



–రాధశ్రీ
సెల్:9494481210

## స్కూల్ ట్యాంక్‌లోని నీరు తాగి.. 20 మంది విద్యార్థులు అస్వస్థత

రాంచీ, జూన్ 22 : స్కూల్ ట్యాంక్‌లోని నీరు తాగి 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. (రాబిబీటవనిబిబ ఈజీశ్రీశ్రీ రాతిఇఒఎ) వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనారోగ్యానికి గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. జార్ఖండ్‌లోని లతేహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

దురులోని అప్‌గ్రేడ్ అయిన ప్రైమరీ స్కూల్‌లో శనివారం మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థులు అక్కడి ట్యాంక్‌లోని నీరు తాగారు. కొంత సేపటి తర్వాత చాలా మంది వాంతులు చేసుకున్నారు.

కాగా, సుమారు 20 మంది స్టూడెంట్స్ అస్వస్థతకు గురికావడంతో వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అడ్మిట్ చేసి చికిత్స అందించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

మరోవైపు ఈ విషయం తెలుసుకున్న బ్లాక్ అధికారి ఆ ప్రభుత్వ పాఠశాలకు చేరుకున్నారు. స్కూల్ వాటర్ ట్యాంకు నీటి నుంచి దుర్వాసన వస్తోందని విద్యార్థులు ఆరోపించారు. దీంతో నీటి నమూనాలు సేకరించారు. పరీక్ష కోసం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత తగిన చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి ఆ అధికారి చేరుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## బీజేవైఎం నాయకులపై పోలీసులు దాడి హేయనీయమం

### -ఖండించిన బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి,



హైదరాబాద్ జూన్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, గ్రూప్స్ రాసే అభ్యర్థుల పట్ల ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేయాలని, గ్రూప్స్ రాసే అభ్యర్థుల డిమాండ్లను నెరవేర్చలని కోరుతూ టిజిపిఎస్సి కార్యాలయం ముందు బీజేవైఎం ఆద్వర్యం లో శాంతి యుతంగా ధర్నా చేస్తే వారిపై పోలీసులు లాటి చార్జి చేయడం అమానుషం,దారుణం ,హేయనీయమని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారుపోలీసుల లాటి చార్జి లో గాయపడిన బీజేవైఎం నాయకులను నాంపల్లి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరామర్శించిన ఆసుపత్రికి వెళ్లి సందర్శించి పరామర్శించారు.ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను కూడా చూడకుండా పోలీసులు దాడి చేయడం సరికాదు .విచక్షణ రహితంగా బీజేవైఎం నేతలను పోలీసులు.. ఈడ్చివేసారన్నారు.పోలీసుల తో ఘర్షణ లో గాయపడిన బీజేవైఎం నేతలు మహేష్, అనీత రెడ్డి, సహా పలువురు నేతలను పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అలాగే డాక్టర్లతో వారి ఆరోగ్య పరిస్తితి గురించి మహేశ్వర్ రెడ్డి..అడిగి తెలుసుకున్న వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

## 19 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ- ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జూన్ 22 :ఎన్నికల కోడ్ ముగియడంతో పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. మల్టీ జోన్ 1లో పరిధిలో పనిచేస్తున్న 19 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎ.వి.రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వారం ఐపీఎస్ అధికారుల బదిలీ అనివార్యమైంది. మల్టీ జోన్ పరిధిలో మరో రెండు మూడు రోజుల్లో మరిన్ని బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి.


ఆహ్వానం

ప్రమీలాశక్తి పీఠం

అంకితోత్సవం, అవార్డు ప్రదానోత్సవం

'ఆర్షకవి' ఆచార్య మసన చెన్నప్ప రచించిన "నాచూపు దేశం వైపు" కవితాసంపుటి ఆవిష్కరణ

తేది: 23-06-2024, ఆదివారం ఉదయం 10.30గం.లకు

వేదిక శివానందాశ్రమం, పద్మారావునగర్, సికింద్రాబాద్.

సభాధ్యక్షులు : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, అధ్యక్షులు, జాతీయ సాహిత్యపరిషత్తు

ముఖ్యఅతిథి : శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ప్రముఖ సాహితీవేత్త, సినీకవి

విశిష్టఅతిథి : శ్రీ బైసదేవదాసు ఎడిటర్, నేటినిజం

కృతిస్వీకర్తలు : శ్రీ గూడూరు మహేందర్‌రెడ్డి VHP ప్రాంతసహ సంపర్క్ ప్రముఖ్, శ్రీమతి గూడూరు నిర్మల

"ప్రమీల శక్తి పీఠం విశిష్ట సాహితీపురస్కారం 2023" ప్రదానం ప్రముఖ కవయిత్రి శ్రీమతి రావూరి వనజగారికి

ఆత్మీయ అతిథులు : శ్రీ వామరాజు సత్యమూర్తి, ప్రముఖ సాహితీవేత్త; శ్రీ సిహెచ్. లక్ష్మినారాయణ, సంస్కృత విద్వాంసులు; డా॥ వెంకటేశ్వర రాజు VHP ప్రాంత సంపర్క ప్రముఖ్; డా॥ కస్తూరిలక్ష్మినారాయణ M.D.(A.M)

అందరికీ ఇదే మా ఆహ్వానం

కార్యక్రమానంతరం భోజనం

# వితంతువులకు మానవ హక్కులు వర్తించవా !

**(23 జూన్ "అంతర్జాతీయ వితంతువుల దినం" సందర్భంగా)**

ప్రపంచవ్యాప్తంగా 258 మిలియన్లకు పైగా వితంతువులుగా అమానవీయ పరిస్థితుల్లో జీవితాలను గడుపుతున్నారు. భారత్‌లోనే దాదాపు 40 మిలియన్ల వితంతువులు ఉన్నారని అంచనా. వితంతువు ఎదురైతే అశుభమని చీదరించుకునే సమాజం మనది. దురదృష్టవశాత్తు భర్తలను అకాలంలో కోల్పోయి వితంతువులుగా మారిన మహిళలు సమాజంలో మానవ హక్కుల హననం, చిన్నచూపు, సాంఘీక ఉత్సవాల నుంచి బహిష్కరణలు, పూజకు పనిరాని విధవలు, లైంగిక దాడి సమస్యలు, ఆస్తి హక్కు సమస్యలు, నిరాదరణలు, పేదరికం, ఆరోగ్య సమస్యలు, గృహ హింస, వేదింపులు, వివక్ష, న్యాయ చిక్కులు, ఆర్థిక బలహీనతలు, సామాజిక కళంకాలు, వస్త్రధారణ పరిమితులు, కట్టు బొట్టుకు దూరం కావడం లాంటి పలు సమస్యల వలయంలో చిక్కి జీవచ్ఛవాల వలె కాలం గడపడం చూస్తున్నాం. చిన్న వయస్సులోనే భర్తలను కోల్పోయిన వితంతువుల సమస్యలు మరింత బాధాకరంగా మారాయి. భార్యను కోల్పోయిన భర్తలకు వర్తించని కట్టుబాట్లు భర్తను కోల్పోయిన భార్యకు శాపంగా మారడం మన పురుషాధిక్య సమాజంలో కొనసాగుతున్న తీవ్రమైన దురాచారమే.

అంతర్జాతీయ వితంతువుల దినం-2024 థీమ్:

వితంతువులు ఎదుర్కొంటున్న అదృశ్య సమస్యలను తీవ్రంగా భావించిన ఐరాస 2010లో నిర్వహించిన సర్వసభ్య సమావేశం తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం ప్రకారం ప్రతి ఏట 23 జూన్ రోజున ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ వితంతువుల దినం (ఇంటర్నేషనల్ విడోస్ డే)" పాటించుట 2011 నుంచి ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ వితంతువుల దినం-2024 థీమ్‌గా "వేగవంతంగా లింగ సమానత్వ సాధన(ఆక్సిలర్టింగ్ ది అచీవ్‌మెంట్ ఆఫ్ జెండర్ ఈక్వాలిటీ)" పలు ప్రపంచ దేశాలకు చెందిన వితంతువులు కనీస మానవ హక్కులకు, సమాజానికి దూరంగా సమస్యలతో నిత్య సంసారం చేస్తూ, భయంకర ఒంటరితనంతో దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. కొందరు వితంతువులు ధైర్యంతో సమాజ కట్టుబాట్లను ఛేదించి తమ తమ రంగాల్లో రాణించి, దేశాభివృద్ధికి దోహదం చేసిన మహిళలు మన ముందు గౌరవంగా, ఆదర్శంగా నిలబడి ఉన్నారు.

వితంతువుల సమస్యలు, పరిష్కారాలు:

వితంతువుల సమస్యలు సమాజానికి కనబడవు, వారి గోడు ఎవరికీ వినబడవు. వితంతువుల పట్ల నెలకొన్న దురాచారాలు, అనారోగ్యకర హానికరమైన దురాచారాలు, అనంత అమానవీయ వివక్షలను చర్చించి సమాజాన్ని జాగృత పరచడానికి 'అంతర్జాతీయ వితంతువుల దినం' వేదికగా మారుతున్నది. వితంతువులకు చేయూత ఇవ్వడం, మేమున్నామని భరోసా గొడుగు కప్పడం, మానవ హక్కులను కల్పించడం, వివక్షను బొంద పెట్టడం, సాధారణ మహిళగా గుర్తించి మానవీయ కోణంలో పెద్ద పీట వేయడం, ఆర్థిక వెసులుబాటు కలిపించడం, విధవల ఒంటరితనాన్ని ఛేదించడం, ఉద్యోగ ఉపాధుల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించడం, విధవల మనోగతానికి విలువ ఇవ్వడం, వితంతువుల సలహాలకు విలువ ఇవ్వడం, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం, వితంతువు యువతులకు విద్య అవకాశాలు కల్పించడం, సాధారణ ముత్తైదువ మహిళ వలె సమాన గౌరవం ఇవ్వడం, సామాజిక భద్రత కల్పించడం, కుటుంబ సభ్యులు ఆదరించడం, పునర్వివాహానికి దారులు వెతకడం, ఒంటరితనాన్ని దూరం చేయడం లాంటి అంశాలను ఊరు వాడల్లో ప్రచారం చేయడం మన కనీస బాధ్యతగా తీసుకోవాలి. నాన్నను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగి పసుపు పారాణి, మంగళ సూత్రంతో పాటు సగం బలాన్ని కోల్పోయిన అమ్మను ఆది దేవతగా చూసుకోవడం కన్న బిడ్డల బాధ్యత, ఇరుగుపొరుగు ఇంగిత జ్ఞానం అని గుర్తించాలి.

వితంతువుల హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వాలు కూడా అవసర చట్టాలు చేయడం, కఠినంగా అమలు చేయడం నిరంతరం కొనసాగాలి. వితంతువుల పిల్లలు సహితం సమాజ చిన్న చూపుకు లోను కావడం, పేదరికంలో మగ్గడం, స్థిరచరాస్తుల సమస్యలతో న్యాయ స్థానాల మెట్లు ఎక్కడం అనాదిగా మన కళ్ల ముందు జరగడం చూస్తున్నాం. యుక్త వయస్సులో భర్తలను కోల్పోయిన వితంతు యువతులకు వివాహాలకు ప్రోత్సహించడం ఒక సదాచారంగా తీసుకోవాలి. భర్తను కోల్పోయి అనంత దుఃఖంలో మునిగిన మహిళకు గోరుచుట్టుపై రోకలి పోటు వలె వితంతువని ముద్ర వేసి సమాజానికి దూరం చేయడాన్ని ముక్తకంటంతో ఎదిరించడం మన కనీస కర్తవ్యం కావాలి. – డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి, 99497 00037

# 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పూసా క్యాంపస్ లో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్



న్యూఢిల్లీ, జూన్ 22 :10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ న్యూఢిల్లీలోని పూసా క్యాంపస్ లోని భారతరత్న సి.సుబ్రమణ్యం ఆడిటోరియం (ఎన్ఏఎస్‌సీ కాంప్లెక్స్)లో ఏర్పాటు చేసిన ఉమ్మడి యోగా సాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ మంత్రులు శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్, శ్రీ భగీరథ్ చౌదరి, వ్యవసాయ పరిశోధన, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ మనోజ్ అహూజా, భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, "యోగా ఆనందకరమైన, ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన జీవితాన్ని గడిపే ఒక శాస్త్రంగానూ, ఒక కళగానూ పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో యోగాకు ఉన్న ప్రాముఖ్యతను ఉద్ఘాటించిన మంత్రి, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుండి యోగాను ప్రపంచ వేదికపై ప్రోత్సహించారని కొనియాడారు. దీని ఫలితంగానే జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా యోగాను క్రియాశీలకంగా ప్రోత్సహిస్తున్న భారతదేశానికి చెందిన సాధువులు, రుషుల కృషిని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రస్తావించారు. శారీరక శ్రేయస్సు, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక అనుసంధానాన్ని పెంపొందించడంలో యోగా పాత్రను పేర్కొన్నారు. యోగాను వ్యక్తిగతంగా వారి జీవనశైలిలో అనుసంధానించాలని మంత్రి ప్రజలను కోరారు. ఆరోగ్యకరమైన శరీరం, సమర్థవంతమైన పనితీరుకు పునాది అని తెలిపిన మంత్రి, సామాజిక చైతన్యం, వ్యక్తిగత సంక్షేమానికి శారీరక ఆరోగ్యం, మానసిక సమతుల్యతను ప్రాథమిక అవసరాలుగా కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను పునరుద్ఘాటించారు.

యోగా కేవలం జూన్ 21వ తేదీకే పరిమితం కాకుండా.., దైనందిన జీవితంలో అంతర్భాగం కావాలని సమావేశంలో మంత్రి అన్నారు. ''యోగా పునాది నియమాలైన 'యమ్', 'నియామ్'- క్రమశిక్షణతో కూడిన జీవనం, మితాహారాన్ని భుజించడాన్ని తెలుపుతుంది'' అని ఆయన వివరించారు. పురాతన ఆయుర్వేద జ్ఞానాన్ని ప్రస్తావిస్తూ, శరీరానికి ప్రయోజనకరమైన, రుతువులకు అనుగుణంగా సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు.

# అప్పుల బాధతో నేత కార్మికుడి ఆత్మహత్య

## -వస్త్ర పరిశ్రమల మూతతో :ఉపాధి కోల్పోయిన నేతన్న

కరీంనగర్, జూన్ 22 :సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్ కార్మిక వాడలో అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో కుడిక్యాల నాగరాజు (42) అనే నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక 11వ వార్డు రాజీవ్ నగర్ కు చెందిన నాగరాజు మరమగ్గాలు (పవర్ లూమ్ లు) నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు.

గత ఆరు నెలల నుండి సాంచాలు మూతపడి ఉపాధి లేకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు గురైనట్టు చెబుతున్నారు. శుక్రవారం అప్పుల బాధతో బాత్రూంలో ఉపయోగించే యాసిడ్ తాగి ఆత్మహత్యా యత్నం చేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

నాగరాజుకు రూ.4లక్షల మేరకు అప్పు అయ్యిందని, ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న కుమారుడికి కళాశాల ఫీజు ఎలా కట్టాలని తీవ్ర ఆందోళనకు గురైనట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆత్మహత్యకు గురైనట్టు తెలిసింది. మృతుడి భార్య లావణ్య (38) బీడీ కార్మికురాలిగా పని చేస్తుండగా పెద్ద కుమారుడు లోకేష్ (16) ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రైవేటు కళాశాలలో చేరాడు. చిన్న కుమారుడు విగ్నేష్ (12) ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుడికి పోస్టుమార్టం నిర్వహించారు.

# పులివెందులలో వైసీపీ సందడి .. సొంత గూటికి జగన్ రాక



అమరావతి, జూన్ 22 :(నేటి నిజం ప్రతినిధి): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత ఇలాఖా పులివెందుల చేరుకున్నారు. మూడు రోజులపాటు ఆయన ఇక్కడే గడపనున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత వైఎస్ జగన్ తొలిసారిగా పులివెందులకు వచ్చారు. శనివారం ప్రత్యేక విమానంలో విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరిన జగన్ మధ్యాహ్నం 1.30 గంటకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు.

ఈసందర్భంగా కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు కె సురేష్ బాబు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కార్పొరేటర్లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున విమానాశ్రయాన్ని చేరుకున్న వైసీపీ కార్యకర్తలు జై జగన్.. జగనన్న జై.. అంటూ నినాదాలు చేసారు. అనంతరం వైఎస్ జగన్ కడప నుంచి రోడ్డు మార్గాన పులివెందుల చేరుకున్నారు. స్థానిక నేతలు కార్యకర్తలతో వైసీపీ అధినేత మాట మంతి నిర్వహించారు.

కాగా.. ఆదివారం, సోమవారం కడప జిల్లా నేతలు, ప్రధానంగా పులివెందుల కార్యకర్తలతో వైసీపీ అధినేత జగన్ భేటీ కానున్నారు. రాత్రికి పులివెందుల లోనే బస చేస్తారు.

### ఓటమిపై సమీక్ష.. కార్యాచరణపై దిశ నిర్దేశం

రాష్ట్రంలో ప్రభుత్వం గెలవలేక పోవడానికి గల కారణాలు.. అందులోనూ ముఖ్యంగా ఉమ్మడి కడప జిల్లాలో ఏడు స్థానాల్లో ఓడిపోవడానికి సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఏడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలిచారు. పులివెందులలో జగన్ పాటు జిల్లాలో మరో ఇద్దరు మాత్రమే గెలవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ పరిస్థితుల నడుమ జిల్లాలో పార్టీని బలోపేతం చేయటం.. క్యాడర్ లో ఉత్సాహాన్ని నింపి భరోసా కల్పించేందుకు ఈ పర్యటన చేపట్టారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలంగా నడపటం కోసం కార్యకర్తల తో పాటూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని జగన్ హామీ ఇవ్వనున్నారు.

### జగన్ కాన్వాయ్ లో స్వల్ప ప్రమాదం..

జగన్ కాన్వాయ్ కి తృటిలో ప్రమాదం తప్పింది. కడప విమానాశ్రయం నుంచి పులివెందులకు వెళ్తుతుండగా కడప నగర శివార్లలోని రామరాజు పల్లి వద్ద కాన్వాయ్ లో వాహనాలు ఢీ కొన్నాయి. వాహన శ్రేణిలో ఇన్నోవా వాహనాన్ని ఫైర్ ఇంజన్ వాహనం ఢీకొంది. ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రధానమంత్రి దార్శనికత వల్ల మన ప్రాచీన యోగా ప్రపంచ సంపూర్ణ శ్రేయస్సుకు శక్తిమంతమైన ఉపకరణమైంది: కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 22 :పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఇవాళ 'ఎబివి ఫౌండేషన్-నిజాం కాలేజి' సంయుక్తంగా నిర్వహించిన వేడుకలలో కేంద్ర బొగ్గు-గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ- ''ప్రజలు... ముఖ్యంగా యువతరం యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది. ప్రధాని దార్శనికత ఫలితంగా మన ప్రాచీన యోగా ప్రపంచమంతటా సంపూర్ణ శ్రేయస్సు సాధనకు ఒక శక్తిమంతమైన ఉపకరణంగా మారింది" అని శ్రీ రెడ్డి అన్నారు.

కాగా, బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులు న్యూఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో 'మన కోసం... సమాజం కోసం యోగా' ఇతివృత్తంగా 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. అదనపు కార్యదర్శులు శ్రీమతి విస్మితా తేజ్, శ్రీమతి రూపిందర్ బ్రార్; సంయుక్త కార్యదర్శులు శ్రీ బి.పి.పతి, శ్రీ సంజీవ్‌కుమార్ కాస్సీ తదితర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యం గురించి శ్రీమతి విస్మిత తేజ్ వివరించారు. ఈ మేరకు నిత్యం యోగాభ్యాసం చేయాల్సిందిగా కార్యక్రమంలో పాల్గొన్నవారికి సూచించారు. నేటి వేడుకల్లో భాగంగా బ్రహ్మ కుమారీ యోగా శిక్షకుడు సాధారణ యోగా కసరత్తులతోపాటు ధ్యాన యోగాభ్యాసాలను ప్రదర్శించారు. మంత్రిత్వ శాఖలోని వివిధ విభాగాల నుంచి 100 మందికిపైగా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాగా, ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభలో తొలిసారి 2014లో శ్రీకారం చుట్టుకున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం 2015 నుంచి ఏటా జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతోంది.

# భద్రాచలం గోదావరి నదిలో.. బాలుడు మృతి

ఖమ్మం, జూన్ 22 : గోదావరి నదిలో బాలుడు మృతి చెందిన ఘటన ఇవాళ భద్రాచలం పట్టణంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి? భద్రాచలం పట్టణంలోని గోదావరి నదిలో స్నానం చేసేందుకు నదిలో ఐదుగురు బాలురు దిగారు..


అయితే స్నానంచేసేందుకు నదిలోకి దిగిన చిన్నారులు నదిలో కొట్టుకుపోతుండగా.. గమనించిన స్థానిక గజ ఈతగాళ్లు వెంటనే స్పందించి వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

# స్వీయ, సమాజం కోసం యోగా అనే ఇతివృత్తంతో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించిన గనుల మంత్రిత్వ శాఖ



న్యూఢిల్లీ, జూన్ 22 :స్వీయ, సమాజం కోసం యోగా అనే నినాదంతో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఢిల్లీలో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించిన శ్రీ వీఎల్.కాంతారావు జీవితాలను సుసంపన్నం చేసుకోవటానికి ప్రతిరోజూ యోగా సాధన చేయాలని హజరైన వారికి సూచించారు. చిన్న ఆవిష్కరణ సభతో కార్యక్ర మం ప్రారంభం కాగా.. అనంతరం ఆయుష్ మంత్రిత్వ శాఖ యోగా ప్రోటోకాల్‌తో కొనసాగింది. 2014 లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రారంభమైన యోగా దినోత్సవం?2015 నుంచి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని నిర్వహిస్తున్నారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును ప్రోత్సహించడంలో యోగా ప్రాముఖ్య తను ఇది హైలైట్ చేస్తుంది. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై తమ ఉద్యోగుల్లో అవగాహన కల్పించే లక్ష్యం తో గనుల మంత్రిత్వ శాఖ అంతర్జా తీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించింది.




# ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన.. బీఆర్ఎస్ మాజీ మంత్రుల ధ్వజం



నాగర్ కర్నూల్, జూన్ 22 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో రాక్షస పాలన సాగుతుందని బీఆర్ఎస్ మాజీమంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని మలచింతలపల్లిలో ఉంటున్న ఆదివాసి ఈశ్వరమ్మపై ముగ్గురు మృగాలు పాశవిక దాడికి గురవడంతో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

ఆ బాధితురాలని పరామర్శించేందుకు మాజీ మంత్రులు ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఆదివాసి ఆడబిడ్డపై జరిగిన హేయమైన చర్యకు మానవత దృక్పథంతో స్పందించి.. చర్యకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకొని శిక్షించాల్సిన అవసరముందన్నారు.

కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మహిళలపై గౌరవం ఉంటే వారిని వెంటనే చట్ట పరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలు కుటుంబానికి రక్షణ కల్పిస్తూ ఎక్స్ గ్రేషియా కింద రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగాన్ని బలోపేతం చేసి ఆడబిడ్డలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# కృత్రిమ మేథను ఉపయోగించి రోడ్డు భద్రతను పెంచడంపై ఐఐఐటి ఢిల్లీతో ఎంఓయు కుదుర్చుకున్న ఎన్ హెచ్ఏఐ

న్యూఢిల్లీ, జూన్ 22 :నేషనల్ కేపిటల్ టెరిటరీ (ఎన్ సిటి) ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక విశ్వవిద్యాలయం ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో (ఢిల్లీ) రోడ్డు భద్రతను పెంపు విషయంలో సహకారానికి ఎన్ హెచ్ఏఐ అవగాహనా ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. కృత్రిమ మేథను ఉపయోగించుకుని జాతీయ రహదారులపై రోడ్ సంకేతాలను మెరుగుపరచడం ఈ ఎంఓయు ప్రధాన లక్ష్యం.

ఈ ఒప్పందంలో భాగంగా ఎంపిక చేసిన నేషనల్ హైవే ప్రాంతాల్లో రోడ్ సంకేతాల అందుబాటు, ప్రస్తుత స్థితికి సంబంధించిన డేటా, ఇమేజ్ లు సేకరించేందుకు ఐఐఐటి ఢిల్లీ సర్వేలు నిర్వహిస్తుంది. ఈ ప్రాజెక్టు కింద సుమారుగా 25,000 కిలోమీటర్ల హైవేను కవర్ చేస్తారు. సర్వేల ద్వారా సేకరించే డేటాను రోడ్డు సంకేతాలను కచ్చితంగా గుర్తించి, వర్గీకరించేందుకు వీలుగా కృత్రిమ మేథను ఉపయోగించి ఐఐఐటి, ఢిల్లీ ప్రాసెస్ చేస్తుంది. ప్రస్తుత రోడ్డు సంకేతాల జియో స్టాంప్డ్ ఇన్వెంటరీ, వాటి స్థూల స్థితి, ఇతర అనుబంధ డేటా సర్వే నివేదికలో ఉంటుంది. సంబంధిత కాంట్రాక్టు ఒప్పందానికి అనుగుణంగా రోడ్డు సంకేతాల ప్రణాళికలోని ఆమోదిత రోడ్డు సంకేతాల ఆవశ్యకత, సర్వే ఫలితాల మధ్య వ్యత్యాసంపై కూడా ఐఐఐటి, ఢిల్లీ అధ్యయనం నిర్వహిస్తుంది.

# అయ్యన్న పాత్రుడు మార్గదర్శకంలో హుందాగా సభ నిర్వహణ- పవన్ కల్యాణ్

-య్యన్నకు ఇక తిట్టే అవకాశం లేదు
-తిట్లను నియంత్రించడం ఇప్పుడు ఆయన కర్తవ్యం
-అయిదేళ్లు అసెంబ్లీలో ఎప్పుడూ తిట్ల పర్వమే
-ఇక అయ్యన్న మార్గదర్శకాలు వాటికి చరమాంకం
-పొట్టి శ్రీరాములు స్పూర్తితో సభ నిర్వహణ
-స్పీకర్ అయ్యన్నను ప్రశంసించిన పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 22 : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 16 వ స్పీకర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన అయ్యన్న పాత్రుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. తొలిసారిగా సభలో అడుగుపెట్టిన తనలాంటి వారికి అధ్యక్ష స్థానంలో



కూర్చున్న అయ్యన్న పాత్రుడు రాజకీయ అనుభవం మార్గదర్శకంగా పనిచేస్తుందని చెప్పారు. కొత్త స్పీకర్ గా ఎన్నికైన అయ్యన్న పాత్రుడి గురించి సభలో పవన్ మాట్లాడుతూ, ఇన్నాళ్లూ అయ్యన్న వాడి వేడి చూసిన ప్రజలు ఇకపై ఆయన హుందాతనం చూస్తారని పేర్కొన్నారు. అయితే, ప్రత్యర్థులను తిట్టే అవకాశం గౌరవ స్పీకర్ పదవి కారణంగా అయ్యన్న కోల్పోవడం కాస్త బాధగా ఉందంటూ పవన్ అన్నారు. దీంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. సభికులు కొందరు బల్లలు చరుస్తూ హర్షం వ్యక్తం చేశారు.

సభలో ప్రత్యర్థులను తిట్టే అవకాశం కోల్పోయిన అయ్యన్న పాత్రుడు.. తిట్టే సభ్యులను నియంత్రించాల్సిన బాధ్యత చేపట్టడం సంతోషంగా ఉందని పవన్ చెప్పారు. స్కూలులో అల్లరి పిల్లవాడిని క్లాస్ లీడర్ గా చేసినట్లుగా ఉందని అన్నారు. అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన సభ హుందాగా నడుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, చర్చల పేరుతో అసభ్య పదజాలం వినిపించకుండా చూడాలని కోరారు. గతంలో సభలో జరిగిన తిట్ల పురాణం వల్ల ప్రజలు విసిగిపోయి, వారిని కేవలం పదకొండు సీట్లకే పరిమితం చేశారని పరోక్షంగా వైసీపీ ఓటమిని పవన్ గుర్తుచేశారు. విజయాన్ని ఆహ్వానించడం మాత్రమే వారికి తెలుసని, ఓటమిని ఒప్పుకోలేక సభ నుంచి పారిపోయారని విమర్శించారు.

## భాష మనుషులను కలపాలి..

భాష నియంత్రణ సభ నుంచే మొదలుకావాలని, గౌరవ స్పీకర్ ఆ బాధ్యత తీసుకోవాలని పవన్ కల్యాణ్ కోరారు. సభలో చిన్నా పెద్ద నాయకుడనే తేడా లేకుండా వ్యక్తిగత దూషణ గత సభలలో చూసి ప్రజలతో పాటు తనకూ బాధేసిందని చెప్పారు. భావంలో ఉండే తీవ్రత భాషలో ఉండాల్సిన పనిలేదని అన్నారు. భాష మనుషులను కలిపేందుకే కానీ విడగొట్టడానికి కాదని, విద్వేషాలు రేపడానికి అంతకంటే కాదని పవన్ అన్నారు. విద్వేషాలను పరిష్కరించడానికి ఉపయోగపడాలని, ఈ సభ ఉన్నదే అందుకని గుర్తుచేశారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు ఈ సభ భవిష్యత్ కు ప్రమాణంగా మారాలని పవన్ కోరారు. సభలో ఇప్పుడున్న వారంతా శాసనాలు రూపొందించడానికే తప్ప ఉల్లంఘించడానికి కాదన్నారు. విభేదించడం, వాదించడం ఇవన్నీ ప్రజాస్వామ్యానికి పునాదులు అని చెప్పారు.

పొట్టి శ్రీరాములు స్పూర్తితో సభ నిర్వహణ.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు మన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతోనే మొదలైందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు బలిదానంతో మన రాష్ట్రం పుట్టిందన్నారు. 56 రోజుల పాటు తిండినీరు మానేసి ఆయన నరకం అనుభవించారు. ఆయన త్యాగాన్ని గుర్తుంచుకుంటూ సభను ప్రతీ నిమిషం రాష్ట్ర పురోభివృద్ధికి ఉపయోగపడేలా సభా సమయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

'అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతిలో విలువలతో కూడిన సత్సంప్రదాయాలకు తెరలేపుతూ మీ ఆధ్వర్యంలో ఈ సభను నడుపుతూ, ఈ విలువైన ఐదేళ్లు రాబోయే తరాలకు గొప్ప భవిష్యత్తును ఇచ్చేలా, రైతులకు అండగా, మహిళలకు భద్రత కల్పించేలా, ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత ఇచ్చేలా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేసేలా చర్చలు జరగాలని కోరుకుంటున్నా. సభాపతి అయ్యన్న పాత్రుడు గారికి మరోమారు శుభాభినందనలు తెలియజేస్తున్నా' అంటూ పవన్ తన ప్రసంగాన్ని ముగించారు.

# నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీరు మార్చుకోకపోతే చర్యలు- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల, జూన్ 22 : జిలాల్లో నకిలీ గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో గతంలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయడం జరిగిందని, నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీరు మార్చుకోకపోతే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు నేరుగా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లా నుంచి ఉపాది నిమిత్తం గల్ఫ్ వెళ్ళే వారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపో వద్దని, ఇమ్మిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారు నుంచి వీసాలు పొందాలన్నారు.

ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న వారు తమ వైఖరి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, జిల్లాలో గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన బాధితుల ఫిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా నుండి ఉపాధి కోసం వెళ్ళే వారి వద్ద నుండి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని, నకిలీ వీసాలు ఇచ్చి, పాస్ పోర్ట్ లు దగ్గర ఉంచుకొని ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్న నకిలీ ఏజెంట్లపై జిలాల్లో గత సంవత్సరం 34 కేసుల్లో 38 మందిని అరెస్ట్ చేసి 09 మందిని జైలుకి తరలించడం జరిగిందని, ఈ సంవత్సరం 34 కేసులలో 58 మందిని అరెస్ట్ చేసి ఇద్దరిని జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు.

ఉపాధి కోసం గల్ఫ్ వెల్లేవారు నకిలీ ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని, గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ కలిగి ఉన్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించి, వారి ద్వారానే వీసాలు పొందాలని సూచించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకొనుటకు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్ స్పెక్టర్ 8712656411 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించవచ్చని ఎస్పీ సూచించారు.

# జమ్మూకశ్మీర్‌లో రూ.1,500 కోట్లకుపైగా విలువైన 84 ప్రధాన అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

న్యూఢిల్లీ, జూన్ 22 : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ శ్రీనగర్‌లోని 'షేర్-ఎ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్' (ఎస్‌కెఐసిసి)లో "యువతకు సాధికారత.. జమ్మూకశ్మీర్ పరివర్తన" పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా రహదారులు, నీటి సరఫరా సహా ఉన్నత విద్యకు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.1,500 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి పథకాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. అలాగే వ్యవసాయం-అనుబంధ రంగాల్లో పోటీతత్వం మెరుగు (జెకెసిఐపి) లక్ష్యంగా రూ.1,800 కోట్ల విలువైన పథకానికి ఆయన శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా తాజాగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 200 మందికి నియామక ఉత్తర్వులు అందజేసే కార్యక్రమాన్ని కూడా శ్రీ మోదీ ప్రారంభించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి, ఈ కేంద్రపాలిత ప్రాంత యువ విజేతలతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ- జమ్మూకశ్మీర్‌లో తన ప్రస్తుత పర్యటన ఎంతో ఉత్తేజభరితమైనదని అభివర్ణించారు. ఇందుకు రెండు నిర్దిష్ట కారణాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మొదటిది... "జమ్మూకశ్మీర్‌లో ఇవాళ వివిధ అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన. ఇక రెండోది.. లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారి జమ్మూకశ్మీర్ ప్రజలను తొలిసారి కలుసుకోవడం" అని తెలిపారు. ఇటీవల జి-7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఇటలీ వెళ్లడాన్ని ప్రస్తావిస్తూ- భారతదేశంపై ప్రపంచ దృక్పథంలో మార్పును ప్రస్ఫుటంగా గమనించానని ప్రధానమంత్రి చెప్పారు. ఒక ప్రభుత్వం మూడోసారి కూడా కొనసాగి, ప్రపంచాన్ని ప్రభావితం చేయడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. భారతీయుల ఆకాంక్షలు నేడు మునుపెన్నడూ లేనంత అధికస్థాయిలో ఉండటం దేశానికి అతిపెద్ద బలమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ భారీ ఆకాంక్షలు ప్రభుత్వ పనితీరుపై అంచనాలను పెంచుతాయని చెప్పారు. ఆకాంక్షాత్మక సమాజం పనితీరును మాత్రమే కొలబద్దగా పరిగణించిన నేపథ్యంలో ఈ ప్రభుత్వానికి మూడోదఫా పదవీకాలం ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. "ఆ మేరకు ప్రభుత్వ ఆలోచనలు, విధానాలపై ప్రజలు తమ నమ్మకాన్ని ప్రస్ఫుటం చేశారు" అని ప్రధాని అన్నారు.

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో ప్రజల తీర్పు దేశంలో సుస్థిరత సందేశాన్ని గట్టిగా చాటిందని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా గత శతాబ్దపు చివరి దశాబ్దంలో సుదీర్ఘంగా సాగిన అస్థిర ప్రభుత్వాల చరిత్రను ఆయన గుర్తుచేశారు. అప్పట్లో కేవలం 10 సంవత్సరాల్లోనే దేశం 5 ఎన్నికలను చూసిందని, ఫలితంగా ప్రగతి స్తంభించిందని చెప్పారు. "దేశం నేడు ఆ దుస్థితినుంచి బయటపడి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయగల సుస్థిర ప్రభుత్వ నవ శకంలో ప్రవేశించింది" అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో జమ్మూకశ్మీర్ ప్రజలు కూడా తమవంతు పాత్ర పోషించారని ఆయన అన్నారు. ఆ మేరకు "మానవత, ప్రజాస్వామ్యం, కశ్మీరత' లపై శ్రీ అటల్ దార్శనికత వాస్తవం కావడాన్ని ఇవాళ మనమంతా ప్రత్యక్షంగా చూస్తున్నాం" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఇటీవలి ఎన్నికలలో రికార్డు స్థాయిలో ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై తమ దృఢ విశ్వాసాన్ని జమ్మూకశ్మీర్ ప్రజలు రుజువు చేసుకున్నారని ప్రధాని ప్రశంసించారు. "ప్రజాస్వామ్య పతాకాన్ని సమున్నతంగా నిలిపిన మీ నమ్మకానికి ధన్యవాదాలు చెప్పడం కోసమే నేనిక్కడికి వచ్చాను" అన్నారు.

"గడచిన 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ కృషి ఫలితంగానే జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుత పరివర్తన సాధ్యమైంది" అని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రాంతంలో స్వల్పాదాయ నేపథ్యంగల మహిళలు, ప్రజలు తమ హక్కులను కోల్పోయారని ఆయన గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం 'సబ్‌కా సాథ్... సబ్‌కా వికాస్' మంత్రంతో వారి హక్కుల పునరుద్ధరణకు, అవకాశాలను దరిచేర్చడానికి శ్రమించిందని పేర్కొన్నారు. తదనుగుణంగా పాకిస్థాన్ నుంచి వలస వచ్చిన శరణార్థులు, వాల్మీకి వర్గ ప్రజలు, పారిశుధ్య కార్మిక కుటుంబాలకు తొలిసారి ఓటు హక్కు లభించిందని ప్రధాని చెప్పారు. తమను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న వాల్మీకి సామాజిక వర్గం చిరకాల వాంఛతోపాటు ఎస్సీలకు చట్టసభల్లో రిజర్వేషన్ సహా పెద్దారి తెగ, పహాడీ కులం, గడ్డ బ్రాహ్మణ, కోలి సామాజిక వర్గాలను ఎస్సీల జాబితాలో చేర్చాలన్న చిరకాల డిమాండ్‌ను నెరవేర్చాల్సి ఉందని పేర్కొన్నారు.

పంచాయతీ, నగరపాలిక, నగర నిగమ్ ఎన్నికల్లో 'ఒబిసి' రిజర్వేషన్ అమలు చేశామని ప్రధాని గుర్తుచేశారు. భారత రాజ్యాంగానికిగల శక్తిని, ప్రతి అక్షరంలో ఉట్టిపడే స్ఫూర్తికిగల ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ- దేశంలోని 140 కోట్ల మంది పౌరుల హక్కులను నిర్ధారిస్తున్నదని పేర్కొన్నారు. అలాగే దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యే అవకాశం కల్పిస్తుందని ప్రధాని నొక్కిచెప్పారు. అయితే, ఈ మహత్తర రాజ్యాంగాన్ని అంగీకరించకపోవడంతోపాటు స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచీ జమ్మూకశ్మీర్ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై శ్రీ మోదీ విచారం వెలిబుచ్చారు. అయితే, "నేడు మనమంతా భారత రాజ్యాంగానికి అనుగుణంగా జీవిస్తున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. అలాగే రాజ్యాంగానుసారం కశ్మీర్ రూపురేఖలను చక్కగా తీర్చిదిద్దే కొత్త మార్గాన్వేషణ చేస్తున్నాం" అని సగర్వంగా ప్రకటించారు. "జమ్మూకశ్మీర్‌లో నేడు ఆర్టికల్ 370 గోడలు తొలగి ఎట్టకేలకు భారత రాజ్యాంగం వాస్తవికార్థంలో అమలవుతోంది" అని శ్రీ మోదీ ఉద్వేగభరిత స్వరంతో చెప్పారు.

గడచిన పదేళ్లలో కశ్మీర్‌లో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ- కశ్మీర్ లోయలో ఇటీవలి పరివర్తనకు ప్రపంచమే సాక్షిగా నిలుస్తోందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ మేరకు జి-20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా లోయలోని ప్రజల ఆతిథ్యాన్ని పలు దేశాధినేతలు నేటికీ ప్రశంసిస్తూనే ఉన్నారని చెప్పారు. లోయ ప్రాంతంలో జి-20 వంటి అంతర్జాతీయ సమావేశం నిర్వహించడం కశ్మీర్ ప్రజలకు గర్వకారణంగా మారిందన్నారు. నిత్యం పొద్దుపోయేదాకా లాల్ చౌక్‌లో పిల్లలు ఆటపాటలు చూసి, ప్రతి భారతీయుడి హృదయంలో ఆనందం ఉప్పొంగుతున్నదని చెప్పారు. అలాగే లోయలోని వ్యాపార ప్రాంతాల్లో నెలకొన్న సందడితో ప్రజల వదనాల్లో చిరునవ్వు ప్రకాశిస్తున్నదని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో దాల్ సరస్సు సమీపాన స్పోర్ట్స్ కార్ ప్రదర్శనను గుర్తుచేస్తూ, యావత్ ప్రపంచం ఆ వేడుకను వీక్షించిందని పేర్కొన్నారు. లోయ ప్రాంతంలో పురోగతికి ఇవే నిదర్శనాలని శ్రీ మోదీ అన్నారు. ఇక కశ్మీర్‌లో పర్యాటకం ఇవాళ చర్చనీయాంశం కావడాన్ని ప్రస్తావిస్తూ- రేపటి అంతర్జాతీయ యోగా దినోత్సవం మరింతగా పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు. ఈ సందర్భంగా లోయను సందర్శించిన పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో 2 కోట్లకు చేరిందని లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా చెప్పడాన్ని ఉటంకించారు. ఈ పరిణామాలన్నీ స్థానిక ఆర్థిక వ్యవస్థ వృద్ధికి గణనీయంగా దోహదం చేస్తాయని ప్రధానమంత్రి చెప్పారు.

"నేటి తరాన్ని గతకాలపు కష్టనష్టాల నుంచి విముక్తం చేసే దిశగా చిత్తశుద్ధితో, నిజాయితీతో నన్ను నేను అంకితం చేసుకుంటున్నాను. హృదయానుగతంగా లేదా ఢిల్లీపరంగా (దిల్ యా దిల్లీ) అంతరాల తొలగింపుపై అన్నివిధాలా కృషి చేస్తున్నాం" అని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్య ఫలాలు ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబానికి అందేవిధంగా సమష్టి కృషి అవశ్యమని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర సాయంలో ప్రతి పైసా వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కేంద్రం నుంచి అందే ప్రతి పైసానూ జమ్మూకశ్మీర్ ప్రజల సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు తెలిపారు. "తమ ప్రతినిధిని ఎన్నుకోవడం, వారి ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడంకన్నా జమ్మూకశ్మీర్ ప్రజలకు కావాల్సింది ఏముంటుంది? కాబట్టే, శాసనసభ ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మీ సొంత ఓటుతో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే సమయం ఎంతో దూరంలో లేదు. జమ్మూకశ్మీర్ ఒక రాష్ట్రంగా త్వరలో మళ్లీ తన భవిష్యత్తును తానే తీర్చిదిద్దుకోగలదు" అని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

నేటి కార్యక్రమాల్లో భాగంగా రూ.1,500 కోట్లకుపైగా విలువైన ప్రధాన ప్రగతి పనులతోపాటు రూ.1,800 కోట్ల విలువైన వ్యవసాయ-అనుబంధ రంగాల (జెకెసిఐపి) ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయడాన్ని ప్రధాని ప్రస్తావించారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను వేగంగా భర్తీ చేయడంపై కేంద్రపాలిత ప్రాంత యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. ఈ మేరకు గడచిన 5 ఏళ్లలో దాదాపు 40,000 నియామకాలు చేపట్టడాన్ని కొనియాడారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌పై భారీ పెట్టుబడుల ప్రభావాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

కశ్మీర్‌లో పురోగతిని ప్రశంసిస్తూ- రైలుమార్గా అనుసంధానం, విద్య-ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన, విద్యుత్, నీరు సహా దాదాపు అన్ని రంగాల్లో నిజమైన ప్రగతిని ఈ లోయ నేడు ప్రత్యక్షంగా చూస్తున్నదని ప్రధానమంత్రి అన్నారు. అంతేకాకుండా ప్రధానమంత్రి గ్రామీణ రహదారుల పథకం కింద వేల కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించామని గుర్తుచేశారు. దాంతోపాటు కొత్త జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలతోపాటు లోయను రైలుమార్గాలతో అనుసంధానిస్తామని ఆయన నొక్కిచెప్పారు. చీనాబ్ రైలు వంతెన ఆకర్షణీయ దృశ్యం ప్రతి ఒక్కరూ గర్వంతో ఉప్పొంగేలా చేస్తోందన్నారు. ముఖ్యంగా... ఉత్తర కశ్మీర్‌లోని గురెజ్ వ్యాలీ తొలిసారి గ్రిడ్ సంధానం పొందిందని తెలిపారు. వ్యవసాయం నుంచి ఉద్యానాల దాకా... క్రీడలు-అంకుర సంస్థల వరకూ అన్ని రంగాల్లోనూ ఈ లోయ అపార అవకాశాలను దరిచేరుస్తుందని శ్రీ మోదీ పునరుద్ఘాటించారు.

కశ్మీర్‌లో దశాబ్దంగా కొనసాగుతున్న అభివృద్ధిని ప్రధానమంత్రి కొనియాడారు. ఈ మేరకు లోయ ప్రాంతం అంకుర సంస్థలు, నైపుణ్యాభివృద్ధితోపాటు క్రీడలకు ప్రధాన కూడలిగా పురోగమిస్తున్నదని చెప్పారు. అలాగే లోయలోని అంకుర సంస్థలలో 70 శాతం వ్యవసాయ రంగానికి సంబంధించినవేనని తెలిపారు. కొన్నేళ్లుగా ఇక్కడ 50కిపైగా డిగ్రీ కళాశాలలు ఏర్పాటైనట్లు గుర్తుచేశారు. "పాలిటెక్నిక్‌లలో సీట్లు పెరిగాయి.. కొత్త నైపుణ్య శిక్షణకు అవకాశాలు అందివచ్చాయి. ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ సహా అనేక కొత్త వైద్య కళాశాలలు కూడా నిర్మితమయ్యాయని చెప్పారు. మరోవైపు పర్యాటక, ఆతిథ్య రంగాల్లోనూ స్థానిక స్థాయిలో నైపుణ్యం పెంచుకుంటున్నట్లు చెప్పారు. పర్యాటక గైడ్‌లకు శిక్షణ కోసం ఆన్‌లైన్ కోర్సులు ప్రవేశపెట్టాలని, పాఠశాలలు-కళాశాలలు-విశ్వవిద్యాలయాల్లో యువ పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేయాలని కూడా ప్రధాని లోగడ సూచించారు. తదనుగుణంగా నేడు ఈ కార్యక్రమాలన్నీ కశ్మీర్‌లో కొనసాగుతున్నాయి.

జమ్మూకశ్మీర్ నారీశక్తిపై ప్రగతి పథకాల సానుకూల ప్రభావాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. స్థానిక స్వయం సహాయ సంఘాల మహిళలకు పర్యాటక, ఐటీ రంగంలో శిక్షణ ఇవ్వడాన్ని ప్రస్తావించారు. అలాగే రెండు రోజుల కిందట 'వ్యవసాయ సఖి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టడాన్ని గుర్తుచేస్తూ- దేశవ్యాప్తంగా 1,200 మందికిపైగా జమ్మూకశ్మీర్ మహిళలు 'వ్యవసాయ సఖి' విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అలాగే 'నమో డ్రోన్ దీదీ' కార్యక్రమం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఈ పథకం కింద జమ్మూకశ్మీర్ యువతులకు శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. "మహిళల ఆదాయం మెరుగుతోపాటు జీవనోపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ఈ మేరకు కృషి చేస్తోంది" అని ఆయన చెప్పారు.

"పర్యాటక, క్రీడా రంగాల్లో భారత్ ఒక ప్రధాన ప్రపంచ శక్తిగా శరవేగంతో దూసుకుపోతోంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ రెండు రంగాల్లో జమ్మూకశ్మీర్ అవకాశాలను ప్రస్తావిస్తూ- ప్రతి జిల్లాలో అద్భుత క్రీడా మౌలిక సదుపాయాలతో ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా సుమారు 100 ఖేలో ఇండియా కేంద్రాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లోని దాదాపు 4,500 మంది యువ క్రీడాకారులు జాతీయ-అంతర్జాతీయ పోటీలకు శిక్షణ పొందుతున్నారని ఆయన వెల్లడించారు. అన్నిటినీ మించి, జమ్మూకశ్మీర్ శీతాకాల క్రీడా రాజధానిగా మారుతోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ మేరకు ఫిబ్రవరి నెలలో 'ఖేలో ఇండియా' 4వ శీతాకాల క్రీడలు నిర్వహించడాన్ని గుర్తుచేశారు. ఈ క్రీడలలో దేశం నలుమూలల నుంచి 800 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. "ఇటువంటి కార్యకలాపాలు రాబోయే రోజుల్లో ఇక్కడ అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణ దిశగా కొత్త అవకాశాలకు బాటలు వేస్తాయి" అన్నారు.

అభివృద్ధి నిరోధక, శాంతి-మానవతా వ్యతిరేక, విచ్ఛిన్న శక్తుల విషయంలో జాగ్రత్త వహించాలని జమ్మూకశ్మీర్ ప్రజలను ప్రధాని హెచ్చరించారు. "జమ్మూకశ్మీర్ ప్రగతిని అడ్డుకోవడానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి విచ్ఛిన్న శక్తులు ఆఖరి ప్రయత్నాలు చేస్తున్నాయి" అని శ్రీ మోదీ అప్రమత్తం చేశారు. ఇటీవలి ఉగ్రవాద దాడుల ఉదంతాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నదని, వీటిని జమ్మూకశ్మీర్ యంత్రాంగం సహకారంతో అరికట్టేందుకుగల మార్గాలపై కేంద్ర హోం మంత్రి సమీక్షించారని గుర్తుచేశారు. "జమ్మూకశ్మీర్ శత్రువులకు గుణపాఠం నేర్పే ఏ అవకాశాన్నీ చేజార్చుకునేది లేదు. ఇక్కడి నవతరం ఇకపై శాశ్వత శాంతితో జీవిస్తుంది. మీరెంచుకున్న ప్రగతి పథాన్ని మేం మరింత బలోపేతం చేస్తాం" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. చివరగా- ఇవాల్టి అభివృద్ధి కార్యక్రమాలపై జమ్మూకశ్మీర్ ప్రజలకు అభినందనలు తెలుపుతూ ఆయన తన ప్రసంగం ముగించారు. ఈ కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ ప్రతాప్‌రావు జాదవ్ కూడా పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో "యువతకు సాధికారత... జమ్మూకశ్మీర్ పరివర్తన" పేరిట నిర్వహించిన కార్యక్రమం ఈ ప్రాంతానికి ఎంతో కీలకం. ఇది జమ్మూకశ్మీర్ ప్రగతిని ప్రస్ఫుటం చేయడంతోపాటు యువ విజేతలకు స్ఫూర్తినిచ్చే దిశగా చేపట్టిన కార్యక్రమం. ఇందులో భాగంగా జమ్మూకశ్మీర్‌లో రూ.1,500 కోట్లకుపైగా విలువైన 84 ప్రధాన అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. వీటిలో రహదారులు, నీటి సరఫరా సహా ఉన్నత విద్యకు మౌలిక సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలు ఉన్నాయి. అంతేకాకుండా చెనాని-పత్నీటాప్-నశ్రీ సెక్షన్ సహా పారిశ్రామిక వాడల నిర్మాణం, 6 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నిర్మాణం వంటి ప్రాజెక్టులకూ ప్రధాని శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా వ్యవసాయం-అనుబంధ రంగాల్లో పోటీతత్వం మెరుగు(జెకెసిఐపి) లక్ష్యంగా రూ.1,800 కోట్ల విలువైన పథకానికి ఆయన శ్రీకారం చుట్టారు. జమ్మూకశ్మీర్‌లోని 20 జిల్లాల్లోగల 90 సమితులలో ఈ పథకం అమలవుతుంది. దీనికింద 15 లక్షల మంది లబ్ధిదారులుగల 3,00,000 గృహాలకు ఇది అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాజెక్టుల శంకుస్థాపన/ప్రారంభోత్సవాలతో యువతకు సాధికారత సిద్ధించడంతోపాటు జమ్మూకశ్మీర్‌లో మౌలిక సదుపాయాలు ఉన్నతీకరించబడతాయి. ఈ కార్యక్రమాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 2,000 మంది యువతకు నియామక ఉత్తర్వుల ప్రదానాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు.

# మానవత్వం చాటిన పోలీస్ బాస్..

-అనాథ వృద్ధుడికి అంత్య క్రియలు
-వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఎస్పీ అఖిల్ మహాజన్
-ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

కరీంనగర్, జూన్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ ఎస్పీ అఖిల్ మహాజన్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం తంగళ్లపల్లి



మండలం కేసిఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో కాల్వ లక్ష్మణ్ అనే వృద్ధుడు మృతిచెందాడు. అతడికి బంధువులెవరూ అందుబాటులో లేకపోవడం, భార్య చేతిలో చిల్లిగవ్వ కూడా లేక అంత్యక్రియలు చేయలేని పరిస్థితి నెలకొంది.

వృద్ధుడి అంత్యక్రియాలకు సాయం చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వాట్సాప్ ద్వారా ఒక యువకుడు మెసేజ్ చేసాడు. వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్‌ను ఆదేశించడంతో ఆయన వెళ్లి సందర్శించి అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం పోలీసుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. మానవత్వంతో స్పందించిన జిల్లా పోలీస్ బాస్‌కు మండల వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నిరంతరం ప్రజలకు అందుబాటులో పోలీసులు.. ఎస్పీ తోట శ్రీనివాస రావు


మహబూబ్‌నగర్, జూన్ 22 : జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత ప్రధాన లక్ష్యంగా పని చేస్తామని జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ? జిల్లా పరిధిలోని సామాన్యుడిని దృష్టిలో పెట్టుకొని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ వుంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, విద్వేషాలను రెచ్చగొట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

మహిళల రక్షణ కోసం, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతామని, అలాగే దొంగతనాల నిరోధానికి మరిన్ని సి.సి కెమెరాలు ఏర్పాటు చేయించడంతో పాటు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందుకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చొరవ తీసుకుంటానన్నారు. చెడు పనులను ఎవరు ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని ఎస్పీ అన్నారు. ఈ మీడియా సమావేశంలో డీ. ఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

# శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూ ధరల్లో మార్పు లేదు : టీటీడీ

తిరుపతి, జూన్ 22 :తిరుమల శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడూ ధరల్లో మార్పు లేదని తిరుమల, తిరుపతి దేవస్థానం స్పష్టం చేసింది. దర్శనం, లడ్డూ ధరలు సవరించినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని కొట్టి పారేసింది.

భక్తులను మోసగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ (ఐఅ) అధికారులు వెల్లడించారు. అవాస్తవాలు, దళారులను నమ్మి భక్తులు మోసపోవద్దని సూచించారు.

ఆహ్వానము
చంద్రబాబు X.O
అనంత భావజాలికుడు
పుస్తక పరిచయం
వేదిక: ప్రెస్ క్లబ్, సోమాజిగూడ, హైదరాబాద్
తేది: 30-6-24 ( ఆదివారం)
సమయం: ఉదయం 11 గంటలకు
సభాధ్యక్షత: డాక్టర్ రామరాజు శ్రీనివాస రావు
చైర్మన్, రామరాజు ఫౌండేషన్, గుంటూరు
ముఖ్య అతిథి: డాక్టర్ వెలమాటి రామనాథ్ గారు,
మాజీ చైర్మన్, ఎపి రేరా
విశిష్ట అతిథులు: శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారు
పూర్వ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ
శ్రీ ఓలేటి పార్వతీశం గారు, ప్రముఖ సాహితీవేత్త
ప్రత్యేక ఆహ్వానితులు: శ్రీ మిక్కిలినేని శ్రీకాంత్ గారు
సిఈఓ, నెక్స్ టెల్ మెటా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్
పుస్తక రచయిత: శ్రీ శాఖమూరు శ్రీనివాస ప్రసాద్, జర్నలిస్టు, గుంటూరు
కార్యక్రమ నిర్వాహకులు:
రామరాజు ఫౌండేషన్, గుంటూరు
జివీఆర్ కల్చరల్ ఫౌండేషన్, హైదరాబాద్


# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల : కలియుగ ప్రత్యక్షదైవంగా కొలవబడుతున్న తిరుమల(ఒతితీబీఎజీశ్రీజీ) వేంకటేశ్వర స్వా?మి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతా నుంచి వచ్చిన భక్తులతో తిరుమలలోని 31 కంపార్టుమెంట్లన్నీ నిండిపోయి ఏటీసీ వరకు క్యూలైన్లో నిలబడియున్నారు.

టోకెన్లు లేని భక్తులకు 15 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 72,294 మంది భక్తులు దర్శించుకోగా 31,855 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.39 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు.

# ఎన్ఇఇటి పేపర్లీక్ కేసు కు సంబంధించి ఎన్ హెచ్ఎఐ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూన్ 22 :ఎన్ఇఇటి పేపర్ లీక్ కేసు తో సంబంధం ఉన్ననిందితుడు పట్ నా లో గల ఎన్ హెచ్ఎఐ అతిథి గృహం లో ఉన్నట్లు కొన్ని పత్రికల లో వార్తకథనాలు వచ్చాయి. పట్ నా లో ఎన్ హెచ్ఎఐ కి ఏ అతిథి గృహం లేదు అని ఎన్ హెచ్ఎఐ స్పష్టం చేయదలచుకొంది. ప్రసార మాధ్యాలు దీనికి అనుగుణంగా ఈ సంగతి ని గమనించడం తో పాటు పొరపాటైన వార్తకథనాన్ని ఒకవేళ ఇప్పటికే విడుదల చేసి ఉంటే గనక ఆ వార్తకథనాన్ని సరి చేయవలసింది గా ఎన్ హెచ్ఎఐ ఒక ప్రకటన లో పేర్కొంది.

# సమాజ సేవలో భాగస్వాములవడం అభినందనీయం.. జడ్జి సునీత కుంచాల




నిజామాబాద్, జూన్ 22 :సమాజ సేవలో భాగస్వాములవ్వడం అభినందనీయమని జిల్లా జడ్జి సునీత కుంచాల కొనియాడారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు సముదాయంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమానికి జిల్లా సునీత కుంచాల ముఖ్యఅతిథిగా హాజరై సెక్స్ వర్కర్లకు, ట్రాన్స్ జెండర్లకు నాలుగు నెలలకు సంబంధించిన ఉచిత బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సేవా దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ పద్మావతి, స్నేహ సొసైటీ సిద్దయ్య, డి ఎల్ ఎస్ ఏ సూపరింటెండెంట్ ఆర్.వి. పురుషోత్తం, పాల్గొన్నారు.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 15 గంటల సమయం



తిరుపతి, జూన్ 22 :కలియుగ ప్రత్యక్షదైవంగా కొలవబడుతున్న తిరుమల వేంకటేశ్వర స్వా?మి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో తిరుమలలోని 31 కంపార్టుమెంట్లన్నీ నిండిపోయి ఏటీసీ(యఅ) వరకు క్యూలైన్లో నిలబడియున్నారు.

టోకెన్లు లేని భక్తులకు 15 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 72,294 మంది భక్తులు దర్శించుకోగా 31,855 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.39 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు.

హనుమంత వాహనంపై కోదండరాముని అలంకారంలో దర్శనం

అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం హనుమంత వాహనంపై కోదండరాముని అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు పుణ్యాహవచనం, వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు గజ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. వాహన సేవలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, భక్తులు పాల్గొన్నారు.

# మరో సంక్షోభం దిశగా ప్రపంచం : ఐక్యరాజ్యసమితి

న్యూయార్క్ జూన్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మరో సంక్షోభం దిశగా ప్రపంచ వెళ్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తెలిపారు. ఇజ్రాయిల్, హిజ్‌బుల్లా మధ్య ముదురుతున్న ఘర్షణ.. మరో ప్రపంచ యుద్ధానికి దారి తీసే అవకాశాలు ఉన్నట్లు ఆయన హెచ్చరించారు. శుక్రవారం ఈ అంశం గురించి ఆయన స్టేట్మెంట్ ఇచ్చారు. కొన్ని రోజుల క్రితం లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి చేసిన ఘటనలో హిజ్‌బుల్లా సీనియర్ కమాండర్ హాజ్ సామి తలేబ్ అబ్దుల్లా హతమయ్యాడు. ఈ నేపథ్యంలో షియా మిలిటరీ గ్రూపునకు చెందిన అధినేత హసన్ నస్రల్లా ఓ వార్నింగ్ ఇచ్చాడు. వెస్ట్ జెరుసలామ్‌లో పూర్తి స్థాయిలో యుద్ధానికి దిగనున్నట్లు నస్రల్లా వార్నింగ్ ఇచ్చిన సందర్భంగా యూఎన్ సెక్రటరీ జనరల్ స్పందించారు.

# జ్యువెలరీ షాప్ దోపిడీ దొంగలు దొరికారు...

హైదరాబాద్, జూన్ 22 :మేడ్చల్‌లో జ్యువెలరీ షాప్ దోపిడీ కేసును మేడ్చల్ పోలీసులు 24 గంటల్లో ఛేదించి నిందితులను పట్టుకున్నారు. జగదాంబ జ్యువెలరీ షాప్‌లో మాస్క్, బుర్ఖా ధరించి యజమానిని కత్తితో పొడిచి డబ్బు ఎత్తుకెళ్లారు దుండగులు. సిసి కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు పోలీసులు. సైబరాబాద్ సీపీ కార్యాలయంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ అవినాష్ మహతి మీడియా మాట్లాడుతూ.. జ్యువెలరీ షాప్ లో దొంగతనం చేయడానికి విఫల యత్నం చేశారని ఆయన పేర్కొన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసామని, మరొకరు పరార్ అయ్యారని తెలిపారు.



మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఇద్దరు నిందితులు జువెలరీ షాప్ లోకి చొరబడ్డారు. ఆ క్రమంలో షాప్ ఓనర్స్ ను చంపడానికి కూడా వెనకాడ లేదన్నారు. రాబరికి పాల్పడుతున్న సమయంలో షాప్ ఓనర్ కేకలు పెట్టారని, వారి మీద దాడి చేసి నిందితులు పరారయ్యారు.. ఈ కేసులో ముగ్గురి భాగస్వామ్యం ఉందని, ఈ కేసులో నిందితులు హైదరాబాద్‌కు సంబంధించిన వారేనని ఆయన తెలిపారు.

ఈ కేసులో ప్రధాన నిందితులు నజీమ్ అజీజ్ కొటాడియా.. షేక్ సోహెల్.. అని, నిందితులు రాబరికోసం చోరీ చేసిన బైక్‌ను వినియోగించారని చెప్పారు. నిందితులు బైక్ను ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేశారని, చోరీ చేయడానికి ముందు నిందితులు మూడుసార్లు రెక్కీ నిర్వహించారన్నారు. సుమారు పదిచోట్ల రెక్కీ నిర్వహించి మేడ్చల్లో దోపిడీకి యత్నించారని, నిందితులను పట్టుకోవడం కోసం సుమా 200 సిసి కెమెరాలు జల్లెడ పట్టామని పేర్కొన్నారు. బైక్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టినప్పుడు చోరీ చేసిన బైక్ గా గుర్తించామని, ఇటీవల చాధర్ ఘాట్ లో జరిగిన చోరీ నిందితుడు కోటడియా పాత్ర ఉందన్నారు. ముందుగా కోటాడియా అరెస్ట్ చేసామని, అతని ద్వారా షేక్ సోహెల్ అరెస్ట్ చేసామని, ఇద్దరికీ జైలులో పరిచయం ఏర్పడిందన్నారు. ఇద్దరు నిందితులకి సహకరించిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.

# హాస్టల్‌లో ఆహారం పరిశుభ్రంగా ఉండాలి: జేఎన్టీయూ రిజిస్ట్రార్



హైదరాబాద్, జూన్ 22 :జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలోని హాస్టల్‌లో విద్యార్థులకు అందించే భోజనం పరిశుభ్రంగా ఉండాలని.. రుచి, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని వర్సిటీ రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం వర్సిటీలోని మంజీరా హాస్టల్‌ను రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ జి. వెంకట నర్సింహారెడ్డి, చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ దుర్గాకుమార్, పీఆర్‌వో ప్రసన్న పరిశీలించారు. హాస్టల్‌లోని వంటగదిలో ఉన్న వంటపాత్రల శుభ్రత, కూరగాయల నాణ్యత, వంట చేసేవారి పరిశుభ్రతతో పాటు వివిధ అంశాలను పరిశీలించారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. ఆ సమస్యలను వెంటనే హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలన్నారు


. బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి రాకుండా చూడాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సరైన వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రిజిస్ట్రార్ వెంట పలువురు కళాశాల అధికారులు ఉన్నారు.

# భార్యపై అనుమానంతో ఏడాది కుమారుడ్ని హత్య చేసిన వ్యక్తి

లక్నో, న్యూఢిల్లీ, జూన్ 22 : ఒక వ్యక్తి తన భార్యను అనుమానించాడు. ఏడాది వయసున్న కుమారుడికి తాను తండ్రి కాదని భావించాడు. ఈ నేపథ్యంలో పసి బాలుడ్ని హత్య చేశాడు. భార్య ఫిర్యాదుతో ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రూపైదిహా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతానికి చెందిన సుజిత్ తన భార్యను అనుమానించాడు. ఏడాది వయస్సున్న కొడుకు తన బిడ్డ కాదని ఆమెతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో గురువారం ఆ పసి బాలుడ్ని హత్య చేశాడు.

కాగా, కుమారుడు అచేతనంగా పడి ఉండటాన్ని సుజిత్ భార్య గమనించింది. వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతూ ఆ బాలుడు మరణించాడు. ఈ నేపథ్యంలో తన బిడ్డను భర్త చంపాడంటూ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో హత్య కేసు నమోదు చేశారు. సుజిత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కుమారుడు తన బిడ్డ కాదని, అందుకే చంపినట్లు అతడు చెప్పాడని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఆ మూడు సేవలపై జీఎస్టీ తగ్గింపు.. చిన్న వ్యాపారులకు మేలు చేసేందుకే.. నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, జూన్ 22 :చిన్న వ్యాపారులకు మేలు చేసేలా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకున్నదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. త్వరలో బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. జీఎస్టీపై ట్రిబునళ్లు, కోర్టుకు వెళ్లే ట్రాన్సాక్షన్ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం తర్వాత నిర్మలా సీతారామన్ మీడియాకు చెప్పారు. అలాగే వ్యాపారులు జరిమానా చెల్లించడంలో ఆలస్యమైతే, దానిపైన వడ్డీ కూడా చెల్లించాల్సి ఉందని, దీన్ని ఎత్తేయాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు.

ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మార్పులు చేయాలని నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రత్యేకించి, ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మోసాలు జరుగకుండా ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి అమలు చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. అన్ని రకాల కార్టన్ బాక్సులపై జీఎస్టీ 12 శాతానికి కుదించడం ద్వారా ఆపిల్, ఇతర పండ్ల వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు. స్ప్రింకర్లు, సోలార్ కుక్కర్లపై జీఎస్టీ 12 శాతానికి తగ్గించాలని కూడా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 73 నిబంధన కింద విధించే జరిమానాలపై ప్రధానంగా చర్చించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు.

గతేడాది అక్టోబర్ తర్వాత జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరుగడం ఇదే తొలిసారి అని నిర్మలా సీతారామన్ చెప్పారు. సార్వత్రిక ఎన్నికల వల్ల చాలా కాలం తర్వాత జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిందని తెలిపారు. శనివారం చర్చించిన అంశాలపై పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తర్వాత మరోమారు చర్చిస్తాం జీఎస్టీ కౌన్సిల్ సమావేశమై ఈ రోజు చర్చించిన అంశాలపై తుది నిర్ణయం తీసుకుంటుందని నిర్మలా సీతారామన్ చెప్పారు.

# ట్రాఫిక్ నియంత్రణకు 80 మంది మార్షల్స్: జాయింట్ సీపీ జోయల్ డేవిస్

హైదరాబాద్, జూన్ 22 : సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్‌సీఎస్‌సీ 50 మంది, రహెజా మైండ్‌స్పేస్ వారు 30 మందిని ట్రాఫిక్ మార్షల్స్‌ను కేటాయించేందుకు ముందుకు వచ్చినట్లు జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. శుక్రవారం ఎన్‌సీఎన్‌సీ, ఐటీ కంపెనీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పాల్గొని ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు సమాజ సేవల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు.

వారి సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌పై పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ, దక్షిణ కొరియా, హెచ్‌ఈ రాయబారి చాంగ్ జే బోక్ బృందం నిర్వహించిన సమన్వయ సమావేశంలో సీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు 18 ఏండ్లుగా వారి వ్యక్తిగత సమయాన్ని సమాజ సేవకు కేటాయిస్తూ పోలీసులకు సహకరిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సేఫ్టీ అండ్ సెక్యూరిటీపై ఎస్‌సీఎస్‌సీ పనితీరు, సాధించిన ఫలితాలను దక్షిణ కొరియా నుంచి వచ్చిన రాయబార బృందానికి ఎస్‌సీఎస్‌సీ ప్రధాన కార్యదర్శి రమేశ్ కాజా, పద్మప్రియ వివరించారు.

# బీఆర్ఎస్ ఓడిపోయిందని బాధగా ఉంది కానీ..

# పార్టీ మారే ఆలోచన లేదు : ఎర్రబెల్లి దయాకర్‌రావు

హైదరాబాద్, జూన్ 22 : తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందించారు. పార్టీ మారే ఆలోచన తనకు లేదని.. కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో కలిసి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందని కొంత బాధ అయితే ఉందని.. కానీ పార్టీ మారే ఆలోచన ఏ మాత్రం లేదని పేర్కొన్నారు.

పార్లమెంటు ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయామనే దానిపై రివ్యూ మీటింగ్‌లు నిర్వహించానని ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఏ మండలం, ఏ గ్రామంలో ఎలాంటి ఫలితాలు వచ్చాయి.. ఎవరు పనిచేశారనే దానిపై సమీక్షలు చేశానని పేర్కొన్నారు. ఆ సమయంలోనే తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించానని చెప్పారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నదే తన ధ్యేయమని తెలిపారు. దానికోసమే సిద్ధంగా ఉన్నానని చెప్పారు. దయచేసి తనపై తప్పుడు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.


# ఆపన్నులకు అండగా పవన్ కల్యాణ్ - పార్టీ కార్యాలయంలోనే సమస్యల పరిష్కారం ..



అమరావతి, జూన్ 22 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ రోజు మధ్యాహ్నం అసెంబ్లీ నుంచి తిరిగి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన సందర్భంలో వివిధ ప్రాంతాల నుంచి తమ బాధలు చెప్పుకొనేందుకు వచ్చిన వారిని చూశారు. వెంటనే కాన్వాయి ఆపి ఆఫీస్ ముందు కుర్చీలు వేసుకొని బాధితులతో మాట్లాడి అర్జీలు తీసుకున్నారు. కొన్ని అర్జీలకి సంబంధించి అప్పటికప్పుడు అధికారులతో ఫోన్లో మాట్లాడారు.

వివిధ సమస్యలపై స్పందించిన ఆయన అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి తమ బాధలు చెప్పుకున్న వారి సమస్యలను పరిష్కరించాలంటూ ఆదేశించారు.. అలాగే. తమ ఇంటి ఆడబిడ్డ కనిపించకపోవడంతో మిస్సింగ్ అంటూ ఫిర్యాదు ఇచ్చామని,అయితే నేటి వరకూ దానిపై ఎటువంటి చర్యలు లేవని ఒక మహిళ పవన్ దృష్టికి తెచ్చింది.. దీంతో ఆయన సంబంధిత పోలీస్ అధికారికి ఫోన్ చేసి వెంటనే మిస్సింగ్ అయిన మహిళ కేసును వెంటనే దర్యాప్తు చేయాలని ఆదేశించారు..

# సభాపతి స్థానంలో అయ్యన్నపాత్రుడు



అమరావతి జూన్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. 16వ శాసనసభాపతిగా సీనియర్ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికను ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఆయనను సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సభాపతి స్థానంలో కూర్చోబెట్టారు. తొలిరోజు సమావేశాల్లో భాగంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణం స్వీకారం చేశారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్లు ముగిశాయి. ఒకే నామిషన్ దాఖలవడంతో అయ్యన్నపాత్రుడి ఎన్నిక ఏకగ్రీవమైంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1983లో టీడీపీ ఆవిర్భావం అనంతరం ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఒకసారి ఎంపీగా పనిచేశారు. పదిసార్లు నర్సీపట్నం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసిన ఆయన ఏడుసార్లు గెలుపొందారు. ఇప్పటివరకు ఐదు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు.

# బండి సంజయి కలిసిన కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



కరీంనగర్, జూన్ 22 : (నేటినిజం ప్రతినిధి) కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కేంద్ర హోం శాఖ సహాయమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి మొట్ట మొదటసారిగా కరీంనగర్ కి విచ్చేసిన బండి సంజయ్ కి ఇప్ప శ్రీనివాస్, కరాటే అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం ప్రసన్న కృష్ణ లు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరాటే అసోసియేషన్, క్రీడాకారుల భవిష్యత్ కోసం తనవంతు కృషి చేస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

# పరీక్షల నిర్వహణలో సంస్కరణల కోసం ఉన్నత స్థాయి కమిటీ

న్యూ డిల్లీ జూన్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పరీక్షల నిర్వహణలో సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్టీఏ ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఇస్రో మాజీ చైర్మన్ కే రాధాకృష్ణన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కమిటీని నియమించినట్లు ఈ మేరకు విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ కమిటీ రెండు నెలల్లో దర్యాప్తు నివేదికను అందజేస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. యూజీసీ నెట్ లీకేజీ కారణంగా రద్దు, నీట్ అవకతవకలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో విద్యామంత్రిత్వ శాఖ పారదర్శకంగా ఉండాలా చూసేందుకు ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ రాధాకృష్ణ నేతృత్వంలో నిపుణుల ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. పరీక్షలను సజావుగా, న్యాయబద్ధంగా నిర్వహించడం, యంత్రంగాన్ని మెరుగుపరచడం, డేటా సెక్యూరిటీ ప్రోటోకాల్‌ను మెరుగుపరచడం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపై సిఫారసులు చేయనున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ బీజే రావు, ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ రెండు నెలల్లో తన నివేదికను విద్యా మంత్రిత్వ శాఖకు సమర్పించనుంది.


ఆహ్వానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ (47 కిన్నెర)

హైదరాబాద్



ప్రముఖ కవి డా॥ ఎన్. గోపి అమృతోత్సవ సందర్భంగా

డా॥ ఎన్. గోపి రచించిన 75 కవితల సంపుటి

'రేపటి మైదానం' ఆవిష్కరణ - అంకితోత్సవం

తేది: మంగళవారం 25 జూన్, 2024, సాయంత్రం 6 గంటలకు

తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్‌టిఆర్ ఆడిటోరియం, పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి-ఆవిష్కర్త : డా॥ కె. శ్రీనివాస్, ఎడిటర్, ఆంధ్రజ్యోతి

సభాధ్యక్షులు : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త

కృతి స్వీకర్త : ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, సుప్రసిద్ధ విమర్శకులు

విశిష్ట అతిథులు : ఆచార్య సూర్యా ధనంజయ, పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ కవి, పరిశోధకులు

డా॥ ఎస్. రఘు, ప్రముఖ విమర్శకుడు, కవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

గౌరవ అతిథులు : శ్రీ వంగల హర్షవర్ధన్, ప్రముఖ రచయిత, పూర్వ జాయింట్ కమీషనర్ (సి.టి.)

డా॥ ఎస్. జతిన్ కుమార్, ప్రముఖ రచయిత, ఆర్థోపెడిక్స్ సర్జన్

ఆత్మీయ అతిథి : శ్రీ కుడికాల వంశీధర్, ప్రముఖ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

గ్రంథ సమాలోచనం : శ్రీ పుప్పాల శ్రీరామ్, ప్రముఖ కవి, విమర్శకులు

సభానిర్వహణ : డా॥ జె. నీరజ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, సిటీ కళాశాల

డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు

మద్దాళి రఘురామ్ కార్యదర్శి

